నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 22 మార్చి 2024 | NIRMAL

## ప్రకటనల ప్రసారానికి అనుమతి తప్పనిసరి

- ఎంసీఎంసీ సభ్యులతో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్



మాట్లాడుతున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్

ఎదులాపురం, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయరాదని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. గురువారం ఆయన చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ప్రీ సర్టిఫికేషన్ ఆఫ్ అడ్వర్టయిజ్‌మెంట్‌లపై శిక్షకులు లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఎంసీఎంసీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడంపై దృష్టిపెట్టాలన్నారు. అభ్యర్థి చేసిన ఖర్చును లెక్కలో చూపించాలని, ఆ మేరకు ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

## మక్కలు కొనండి మహాప్రభో..



పెంచికల్‌పాడ్‌లో మక్కలు కొనాలని నిరసన తెలుపుతున్న రైతులు

కుంటాల, మార్చి 21 : మండలంలోని ఆయా గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి మక్కలను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం పెంచికల్‌పాడ్‌లో మక్కలను ఆరబెట్టిన ప్రదేశంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ సర్కారు మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని, విధిలేని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురిస్తున్నదన్నారు. తమ వద్ద కొనుగోలు చేసి, గోదాముల్లో దాచుకొని ధర వచ్చినపుడు లాభం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. నిరసన తెలిపిన వారిలో కిష్టయ్య, రత్నాకర్‌రెడ్డి, గణేశ్ పటేల్, గోపాల్, మధు పటేల్ ఉన్నారు.

# సీసీఐ శఠగోపం

### నాణ్యత పేరిట నట్టేట ముంచిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ

- క్వింటాలుకు రూ.6,920 ఇచ్చింది.. ప్రైవేటులో రూ.7,550..
- క్వింటాలుకు రూ.630 చొప్పున కోట్లు నష్టపోయిన కర్షకులు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు(ఫైల్)

ఆదిలాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వాకం ఫలితంగా రైతులు భారీగా నష్టపోవాల్సి వచ్చింది. జిల్లావ్యాప్తంగా అక్టోబర్ చివరి వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీసీఐ ఆధ్వర్యంలో అధికారులు పది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020తో సీసీఐ కొనుగోలు చేయాలి. కానీ.. జనవరి 20 వరకు అంతంత మాత్రంగానే కొనుగోలు చేసి, అనంతరం రైతులను నష్టపర్చేలా చర్యలు చేపట్టింది. పంట నాణ్యత లేదంటూ క్వింటాలుకు రూ.50 తగ్గించి రూ.6,970తో.. జనవరి 1 నుంచి రూ.100 తగ్గించి క్వింటాలుకు రూ.6,920తో కొనుగోలు చేసింది.

**రైతులకు నష్టం**

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 20.13 లక్షల క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరిగాయి. ఇందులో 15.72 లక్షల క్వింటాళ్ల పత్తిని 80,905 మంది రైతులు సీసీఐకి విక్రయించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.7,550తో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 ఉండగా.. రూ.530 అధికంగా చెల్లించి ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ రూ.6,920 చెల్లించగా.. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.630 అధికంగా చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ధర పెరగడంతో రైతులు కోట్ల రూపాయలను నష్టపోవాల్సి వచ్చింది. పంట నాణ్యత పేరిట సీసీఐ క్వింటాలుకు రూ.100 తగ్గించగా, అదే పత్తిని ప్రైవేటు వ్యాపారులు అధిక ధరతో ఎలా కొనుగోలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, తాను లాభపడి రైతులకు నష్టాన్ని చేకూర్చిందని రైతులు మండిపడుతున్నారు.

**అంతా అమ్ముకున్నాక ధర పెంచి కొంటున్నారు..**



*నా పేరు అండె యాదగిరి. మాది తాంసి మండలంలోని పొన్నారి గ్రామం. నాకున్న 16 ఎకరాల్లో పత్తి వేశా. 130 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో నవంబర్‌లో ప్రైవేట్ వ్యాపారులకు రూ.6,800లతో 70 క్వింటాళ్లు అమ్మాను. దీంతో రూ.4.76 లక్షలు వచ్చాయి. అదే సీసీఐ రూ.7,020 మద్దతు ధరతో కొనుగోలు చేస్తే రూ.4.91 లక్షలు వచ్చేవి. డిసెంబర్‌లో సీసీఐకి 60 క్వింటాళ్లను రూ.7,020 ధరతో అమ్మగా రూ.4.21 లక్షలు వచ్చాయి. గిప్పుడేమో ప్రైవేట్ వ్యాపారులు రూ.7,550 పెట్టి కొంటున్నారు. ఇప్పుడు అమ్ముకుంటే రూ.9.81 లక్షలు వచ్చేవి. అంతా అమ్ముకున్న తర్వాత ధర పెంచి కొంటే ఏంలాభం.*

## నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తాం..

- కేంద్ర మంత్రి సమావేశంలో కరెంటు పోయింది నిజమే..
- కొన్ని నిమిషాల్లోనే పునరుద్ధరించాం..
- ఆదిలాబాద్ సర్కిల్ ఎస్ఈ జయవంత్‌రావ్ చౌహాన్

తాంసి(తలమడుగు), మార్చి 21 : మండల కేంద్రంలోని అయేషా గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా మాట్లాడుతుండగా సాంకేతిక కారణాలతో కరెంటు ట్రిప్ అయిందని ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జయవంత్‌రావ్ చౌహాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే సిబ్బంది తేరుకుని కొన్ని నిమిషాల వ్యవధిలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు. అన్ని సెక్షన్ల పరిధిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.



బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి రామన్న, పార్టీ నాయకులు

# అభివృద్ధే గెలిపిస్తుంది..

### కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రగతి పరుగులు పెట్టింది..

### కాంగ్రెస్ హయాంలో అన్ని పథకాలు అమలు కావడం లేదు..

- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- సక్కును ఎంపీగా గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇద్దాం..
- మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ ముఖ్యనేతలతో సమావేశం

ఎదులాపురం, మార్చి 21 : 'కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు పర్చిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రామన్న నేతృత్వంలో మండల, పట్టణ ముఖ్యనేతలతో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటికీ చాలా మంది లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా.. ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చేరలేదని విమర్శించారు. ఏడు నియోజకవర్గాల నాయకులు కలిసికట్టుగా పని చేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రం విడిపోయిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీసీఐ పునరుద్ధరణ, టెక్స్‌టైల్ పార్కు, గిరిజన యూనివర్సిటీ వంటి అంశాలపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నదన్నారు.

**సక్కును గెలిపిద్దాం..**

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా శ్రేణులు కృషి చేయాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, మహిళా అధ్యక్షురాలు స్వరూపారాణి, వార్డు కౌన్సిలర్లు భరత్‌కుమార్, ప్రకాశ్, సంద నర్సింగ్, నాయకులు సాజిదొద్దీన్, అష్రఫ్, నారాయణ, భూమన్న, రామ్‌కుమార్, యోగేశ్, కరుణ పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

- ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి
- వీఎస్‌టీ, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో సమీక్ష



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా టౌన్, మార్చి 21 : ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో వీఎస్‌టీ, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో గురువారం సమీక్ష నిర్వహించారు. అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలను వివరించారు. ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఎస్‌టీ బృందాలు స్పందించాలని సూచించారు. వారికి కేటాయించిన ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టి నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు పట్టుబడితే సీజ్ చేయాలన్నారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. రూ.50 వేలకుపైగా నగదు పట్టుబడితే కేసు నమోదు చేసి, ఆ సమాచారాన్ని నోడల్ అధికారికి తెలియజేయాలన్నారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించే వారిపై నిఘా ఉంచాలన్నారు. తనిఖీలకు వెళ్లేటప్పుడు మహిళా సిబ్బందిని కూడా వెంట తీసుకెళ్లాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నికల పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు ముద్రించే ముందు ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలని, వాటి కింద ప్రింటింగ్ ప్రెస్ పేరును నమోదు చేయాలన్నారు. నియోజకవర్గంలోని ఎంఆర్‌వో ప్రవీణ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటేయాలి..



ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్పీ, డీఎస్పీ, సీఐ, పోలీసులు

ఎదులాపురం, మార్చి 21 : ప్రజలు భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా వద్ద ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ఎన్టీఆర్ చౌక్, వినాయక చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, దేవిచంద్ చౌక్, వన్ టౌన్ మీదుగా ఎన్టీఆర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈవీఎంల భద్రత, చెక్‌పోస్టుల నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, వీవీ పాయింట్‌ల వద్ద భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ కమాండెంట్ శ్రీకాంత్, పట్టణ సీఐలు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, ఫణిదర్, సాయినాథ్ పాల్గొన్నారు.

## అడవులను రక్షించాలి..

- అధికారులు ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం
- అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో, అధికారులు

ఎదులాపురం, మార్చి 21 : అడవులను కాపాడడానికి అధికారులు ప్రాణాలు ఫణంగా పెడుతున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అటవీ శాఖ కార్యాలయం నుంచి వినాయక్‌చౌక్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, బస్టాండ్, కలెక్టర్ చౌక్ మీదుగా జడ్పీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటుతూ, వాటి రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చెట్లను పెంచాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణ తీసిన చిత్రాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో బర్నొబా, ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ పాల్గొన్నారు.

## నిరంతరం నిఘా పెట్టాలి..

- ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం..
- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి..
- వీడియోగ్రఫీ తప్పకుండా ఉండాలి..
- కలెక్టర్ రాజర్షి షా



పిప్పర్‌వాడలోని టోల్‌ప్లాజా వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జైనథ్, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పిప్పర్‌వాడలోని టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం నిర్మల్ ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ వాహనాలను తనిఖీ చేస్తూ, సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరంతరం వీడియోగ్రఫీ నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఫారెస్ట్, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, ఆదాయం పన్ను శాఖ డిపార్ట్‌మెంట్ల వారు విధులు నిర్వహిస్తారన్నారు. బేల మండలంలోని శంకర్‌గూడ, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా, జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్, భీంపూర్ మండలంలోని కరంజి, తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, బోథ్ మండలంలోని ఘన్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఆర్ఐ సాయి పాల్గొన్నారు.

## నగదు పట్టివేత

నర్సాపూర్(జి), మార్చి 21 : మండల కేంద్రంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నాందేడ్‌కు చెందిన ఇర్ఫాన్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.70 వేలు తీసుకెళ్తున్నాడు. ఈ డబ్బులను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల కోసం సీటీవోకు పంపినట్టు ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

## ఓటు వేయడంతోపాటు వేయించాలి..

- 7,078 మంది ఓటర్లుగా నమోదుకావడం శుభపరిణామం
- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 21 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకు ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు వేయడంతోపాటు అందరితో వేయించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నూతన ఓటర్లకు స్వీప్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరుకు చైతన్యం కలిగిస్తున్నామన్నారు. జిల్లాలో కొత్తగా 7,078 మంది ఓటర్లుగా నమోదు కావడం శుభపరిణామం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటింగ్ మిషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్‌డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



వంతెన లేక ముందు గోదావరిలో నుంచి వస్తున్న బస్సు(ఫైల్)



గతంలో జగిత్యాల నుంచి కడెంకు వచ్చిన బస్సు(ఫైల్)

**ఉచితం దేవుడెరుగు.. ప్రయాణం కనుమరుగు..**

## ఆర్టీసీ సేవలు బంద్

- బస్సులు నడవకపోవడంతో ప్రయాణికుల అవస్థలు
- తిరిగి పునఃప్రారంభించాలని వేడుకోలు

కడెం, మార్చి 21 : ఆర్టీసీ సేవలు అందక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో బస్సులు నడువగా.. కాంగ్రెస్ సర్కారు ఆధ్వర్యంలో బంద్ అయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కడెం-జగిత్యాల మధ్య వయా రాయికల్ మీదుగా బస్సులు నడిచేవి. ప్రస్తుతం నడవడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పరిధిలోని కడెం-రాయికల్ మండలాల మధ్య బెల్లాల్-బోర్నపల్లి వద్ద ప్రవహిస్తున్న గోదావరిపై 2018 సంవత్సరంలో రూ.700 కోట్లు పెట్టి నూతనంగా వంతెన నిర్మించారు. వంతెన నిర్మించక ముందు కూడా బస్సులు నడిచాయి. వంతెన పైనుంచి జగిత్యాల డిపోకు చెందిన బస్సులు రాయికల్, వడ్డెలింగాపూర్, బోర్నపల్లి మీదుగా కడెం మండలంలోని బెల్లాల్, కొండుకూర్ మీదుగా రోజుకు నాలుగు ట్రిప్పులు నడిచాయి. అలాగే రాయికల్ మీదుగా మరో సర్వీస్ కూడా వయా బెల్లాల్, చిట్యాల్, మద్దిపడగ, ఎలగడప, లింగాపూర్ మీదుగా ఖానాపూర్ వరకు నాలుగు ట్రిప్పుల సర్వీస్ నడిచింది. తాజాగా అవి బంద్ కావడంతో వందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల కడెం మండలంలోని బెల్లాల్‌తోపాటు, ఇతర గ్రామాలకు చెందిన నాయకులు నిర్మల్, జగిత్యాల డిపో మేనేజర్లకు ఆర్టీసీ సేవలను పునఃప్రారంభించాలని వినతి పత్రాలను అందించారు.